ప్రయత్నమా.. పరిష్కారమా?

- వర్షాకాలంలోపు పనులు పూర్తవడం కష్టమే
- రూ.3.5కోట్లతో చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులపై అయోమయం



ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో జరుగుతున్న బాక్స్‌డ్రైన్ పనులు

ఖైరతాబాద్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పేరుకే ఇది పాష్ కాలనీ.. ఒక భారీ వర్షం వస్తే మాత్రం వీధుల్లోకే కాదు.. ఇళ్లల్లోకే నీరు చేరుకుంటాయి. వరుసగా వర్షాలు వస్తే కాలనీ నుంచి బయటకు వెళ్లే పరిస్థితి ఉండదు. గ్రేటర్ నగర నడిబొడ్డున ఉన్న ఖైరతాబాద్ ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ పరిస్థితి ఇది. దశాబ్దాల కాలంగా ఉన్న ఈ ముంపు సమస్యపై గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ. 25లక్షలతో పనులు చేసినా పరిష్కారం లభించలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అధికారులతో సమావేశమై రూ.3.5 కోట్లతో బాక్స్ డ్రైన్ పనులు చేపట్టాలని నిర్ణయించి హడావిడిగా పనులు ప్రారంభించారు. గతంలో ఉన్న పైప్‌లైన్‌ను తొలగించి అదే స్థానంలో బాక్స్‌డ్రైన్ పనులు చేపడుతుండడం, ఈ పనులతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అధికారులు పక్కాగా హామీ ఇవ్వలేకపోతుండడంతో స్థానికుల్లో ఏదో తెలియని అయోమయం నెలకొంది. ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్‌ను తొలగిస్తూ వేస్తున్న కొత్త పనులు ఎంతవరకు సఫలమవుతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సంప్ నుంచి ఎత్తిపోతల ద్వారా లేక్‌వ్యూ పార్కులోకి..

ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో వర్షపునీరు చేరితే అవి రెండు మార్గాల ద్వారా బాక్స్ డ్రైన్ నుంచి వచ్చి కొత్తగా చేపట్టే సంప్‌లోకి చేరుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకటి పీడబ్ల్యూ వర్క్‌షాప్ నుంచి ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం, సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌ల ఉమ్మడి స్థలం నుంచి, మరొకటి జైన్ స్థానక్ హాల్ ద్వారా ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం లోపలి నుంచి సంప్ వరకు బాక్స్‌డ్రైన్ పనులు కొనసాగుతున్నాయి. ముద్రణాలయం నుంచి మింట్ కాంపౌండ్ వెళ్లే మార్గంలోని చౌరస్తాలో ఉన్న ఐలాండ్‌ను ఇప్పటికే తొలగించగా అక్కడ 10 మీటర్ల పొడవు, 2మీటర్ల వెడల్పు, 20 అడుగుల లోతులో సంప్ నిర్మించి అందులోకి చేరుకునే వర్షపు నీటిని మోటారు పంపుల సహాయంతో లేక్‌వ్యూ పార్కులో ఉన్న సరస్సులకు తరలించాలనే ప్రణాళికతో పనులు జరుగుతున్నాయి.

సంప్‌లెవల్స్ సరిపోవనే వాదనలు

ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్, మింట్ కాంపౌండ్ రహదారి లెవల్స్ కింద, మీదకు ఉండడంతో ఇప్పటికే మింట్ మార్గంలో ఉన్న బార్స్‌డ్రైన్ పనులు దాదాపు 10 అడుగుల లోతు వరకు జరుగుతుండగా సంప్‌లెవల్స్ సరిపోవనే స్థానికుల వాదనలు వినిపిస్తున్నారు. మరోవైపు సంప్‌లోకి చేరుకున్న వెంటనే మోటార్లు ప్రారంభించి నీటిని మరో పైప్‌లైన్‌లోకి తరలించడం అంత సులువైన పని కాదని పలువురు ఆరపిస్తున్నారు. ఎన్నో యేళ్లుగా స్థానికులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించకుండా అధికారులు హడావిడి నిర్ణయాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శిస్తున్నారు. ఈసమస్యపై స్థానిక నాయకులు ఓ ఇంజనీరింగ్ నిపుణుల బృందంతో అధ్యయనం చేసి, వారు ఇచ్చిన సలహాలను పట్టించుకోకుండా హడావిడి నిర్ణయాలతో పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ముద్రణాలయ అనుమతేది?

జీహెచ్‌ఎంసీ అధికారులు, పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ మార్చి చివరిలోగా పనులు పూర్తి చేస్తామని చెబుతున్నా, అది సాధ్యమయ్యేలా లేదు. జైన్ మందర్ పక్కనుంచి వస్తున్న బాక్స్ డ్రైన్ పనులు ప్రభుత్వ ముద్రణాలయం ప్రధాన గేటు ఎదుట వెళ్లాల్సి ఉండగా, ఇప్పటివరకు ముద్రణాలయ అనుమతి కోరలేదు. ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను అందించే ఈ సమయంలో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నా జూన్ చివరి వారం వరకు అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని ముద్రణాలయ అధికారులు చెబుతున్నారు. ముద్రణాలయ ప్రధాన గేటు గుండా పుస్తకాలను తరలించే భారీ లారీలు వచ్చి వెళ్లాల్సి ఉంటుందని, ఇప్పట్లో అనుమతి ఇచ్చే అవకాశం లేదని వారు చెబుతుండగా, అధికారులు మాత్రం మార్చి చివరికల్లా పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారు. వర్షాకాలం లోపు పనులు పూర్తి కాకపోతే పరిస్థితిని ఊహించుకుంటేనే భయమేస్తోందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శివోహం..



ఎల్లారెడ్డిగూడ శివాలయంలో అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, శ్రీనివాస్‌యాదవ్



అభిషేకాన్ని వీక్షిస్తున్న భక్తులు



శంకర్‌లాల్ నగర్ ఆలయంలో భక్తుల పూజలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గంలో బుధవారం మహా శివ రాత్రి పూజలు ఘనంగా జరిగాయి. శివనామస్మరణతో శివాలయాల్లో ఆధ్యాత్మికత శోభ నెలకొంది. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో అభిషేకాలు, పూజలు చేసి ఉపవాస దీక్షలు చేపట్టారు. శివపార్వతుల కల్యాణమహోత్సవం నిర్వహించారు.



బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్ ఆలయంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు

బంజారాహిల్స్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి)



శ్రీనగర్‌కాలనీలో భక్తులకు దర్శనమిచ్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి



సనత్‌నగర్ డివిజన్‌లోని శివాలయంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, వంశీ, చంద్రపాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

- సనత్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి)



సైంటిఫిక్ కాలనీ మణికంఠ ఆలయంలో శివలింగార్చన పూజలో భక్తులు



భక్తులతో కలిసి అభిషేకం చేస్తున్న అర్చక, సిబ్బంది



ఎన్టీఆర్‌మార్గం ఆంజనేయ ఆలయంలోని శివుడిని దర్శించుకోవడానికి భక్తుల క్యూ



ఎర్రగడ్డ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బంజారాహిల్స్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఉదయం మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకం, సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం, రాత్రి లింగోద్భావన పూజాధికాలు నిర్వహించారు. ఎల్లారెడ్డిగూడ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని రామలింగేశ్వరస్వామికి అభిషేకం చేశారు. బంజారాహిల్స్ జగన్నాథస్వామి దేవాలయం, హరే కృష్ణమూవ్‌మెంట్ ఆధ్వర్యంలో స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి(స్వర్ణ) దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- **ఎర్రగడ్డ:** ఎర్రగడ్డలోని నాలుగు గుల్ల దేవాలయంలోని శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు జాగరణ చేయడానికి ఆలయాల్లో భజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.
- **అమీర్‌పేట:** అమీర్‌పేట, బల్కంపేటలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.
- **ఖైరతాబాద్:** ఎన్టీఆర్ మార్గం హనుమాన్ మందిరంలోని శివాలయంలో, ఖైరతాబాద్ ముద్రణాలయం ఎదురుగా ఉన్న శివాలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఆలయాల నిర్వాహకులు సందీప్, రాజశేఖర్, మురళి, సహదేవ్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. ముద్రణాలయం వద్ద ఉన్న శివాలయంలో జాగరణ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అల్యూమినియం ఫ్రేమ్స్ చోరీకి యత్నం

- ఒకరి అరెస్టు



ధ్వంసమైన పోలీస్ అవుట్ పోస్ట్ అద్దాలు

పంజాగుట్ట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్ వద్ద పోలీస్ అవుట్ పోస్ట్‌నుంచి అల్యూమినియం ఫ్రేమ్స్ చోరీకి యత్నిస్తున్న ఓ పాత నేరస్థుడుని అక్కడే భద్రతా ఏర్పాట్లలో ఉన్న పోలీస్ సిబ్బంది పట్టుకుని పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు. బేగంపేట లైఫ్‌స్టైల్ బిల్డింగ్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై నివాసం ఉండే మధు పాత నేరస్థుడు. గురువారం రాత్రి ప్రజా భవన్ వద్దనున్న పోలీస్ అవుట్ పోస్ట్ అద్దాలు పగులగొట్టి, అల్యూమినియం ఫ్రేమ్స్ తొలగించి, తరలించడానికి యత్నిస్తుండగా భద్రతా సిబ్బంది అతన్ని పట్టుకుని పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు. అతన్ని విచారించగా డబ్బుల కోసమే దొంగతనం చేస్తున్నట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు.

'సుప్రీం కోర్టు రీజనల్ బెంచ్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి'

బర్కత్‌పుర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్ ఏర్పాటు బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని దక్షిణభారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు ఎస్.నాగేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్ ఏర్పాటు చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. రీజనల్ బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 100 ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏప్రిల్ 12, 13తేదీల్లో జానపద కళా ప్రదర్శన



జానపద కళా ప్రదర్శన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నటరాజ అకాడమీ డైరెక్టర్ గిరి, పాశం యాదగిరి

పంజాగుట్ట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న జానపద కళలను వెలుగులోకి, ప్రాచుర్యంలోకి తీసుకొచ్చే లక్ష్యంతో మనం ఫౌండేషన్ సహకారంతో ఏప్రిల్ 12, 13తేదీల్లో లలిత కళాతోరణం, రవీంద్రభారతిలో తెలంగాణ జానపద కళాకారులతో కళా ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు నటరాజ అకాడమీ డైరెక్టర్ గిరి తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, తదితరులతో కలిసి జానపద కళా ప్రదర్శన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా సుమారు 3,500మంది కళాకారు లు ఎల్బీ స్టేడియం నుంచి రవీంద్రభారతి మీదుగా నాంపల్లిలోని లలిత కళాతోరణానికి ర్యాలీగా చేరుకుంటారని తెలిపారు. తెలంగాణలో ఉన్న ప్రతి కళారూపాన్ని వెలికి తీసి నేటి తరాలకు తెలియ చెప్పాలన్నదే తమ ఉదేశ్యమన్నారు. అమెరికాలో ఉంటూ జానపదాలను కాపాడాలనే ఆశయంతో ఎన్ఆర్ఐ శరత్ చంద్ర ఆర్థిక సహకారం అందజేస్తున్నారన్నారు. వేడుకలకు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావులను ఆహ్వానించినట్టు తెలిపారు.



నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిమ్స్‌కు వచ్చిన మంత్రి దామోదర రాజ నరసింహను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేసిన యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నరసింహులు

- సనత్‌నగర్, మార్చి 8(ఆంధ్రజ్యోతి)

నేడు గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం

ఎర్రగడ్డ, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కొంతమంది గర్భిణులు ఆర్థిక స్తోమత లేక ప్రాథమిక పరీక్షలు కూడా చేయించుకోవడం లేదని, అలాంటి వారి కోసం నీలిమ హాస్పిటల్ 'నీలిమ 9' పేరుతో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తోందని ఆస్పత్రి ఎండీ నీలిమా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నీలిమ ఆస్పత్రిలో నీలిమ 9 పేరుతో ప్రతి నెల 9వ తేదీన గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. పేద గర్భిణులకు చేయూతను అందించడానికి ప్రతినెల నీలిమ 9ఉచిత వైద్య శిబిరంలో పేరు నమోదు చేయించుకున్న వారికి ఉచిత మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డాక్టర్ రెడ్డీస్ ఉద్యోగి అదృశ్యం



సతీష్

దుండిగల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్లిన డాక్టర్ రెడ్డీస్ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. దుండిగల్ ప్రాంతంలోని గండిమైసమ్మ మేఘన రెసిడెన్సీలో నివాసముంటున్న గట్టిమి సతీష్(36), సత్యగౌరి భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సతీష్ బాచుపల్లిలోని డాక్టర్ రెడ్డీస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 6వతేదీ మధ్యాహ్నం డ్యూటీకి వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. భార్య సాయంత్రం ఫోన్‌చేసినా సమాధానం ఇవ్వక పోవడంతో అతడి స్నేహితులకు ఫోన్ చేయగా సతీష్ విధులకు హాజరుకాలేదని చెప్పారు. దీంతో సత్యగౌరి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకూ రాజ్యాధికారం



అవార్డుల మొదట సీజన్ సంచికను ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, శ్రీశైలం యాదవ్

బంజారాహిల్స్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పురుషులతో సమానంగా మహిళలు రాజ్యాధికారం సాధిస్తున్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఐ గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ తాజ్ డెక్కన్‌లో శుక్రవారం వివిధ రంగాల్లో రాణించిన 55 మంది మహిళలకు షీ ఇన్‌స్పైర్స్ హానర్ పేరిట అవార్డుల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ ముందుగా ఎన్ఎస్ఐ గ్లోబల్ మొదటి ఎడిషన్ సంచికను విడుదల చేశారు. ఈసందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ... 50ఏళ్ల క్రితమే గుండమ్మ కథలో సినీ గేయ రచయిత రాసిన లేచింది మహిళా లోకం పాట ఇప్పుడు నిజం అవుతుందన్నారు. భారతదేశంలో మహిళలకు ఉన్న ప్రాముఖ్యత ప్రపంచంలో ఎక్కడా లేదని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కూడా మహిళలే కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సోనియాగాంధీ, మీనాకుమారి, సుష్మాస్వరాజ్ లాంటి నారీమణులు తెలంగాణ కలను నిజం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉందన్నారు. డ్వాక్రా గ్రూపులను పటిష్టం చేయనున్నట్టు వెల్లడించారు. మహిళా పారిశ్రామికవేత్తలను తగిన విధంగా ప్రోత్సహించనున్నట్టు ఆయన చెప్పారు. రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్‌జోషి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి జీవితం అమ్మ పాత్ర చాలా కీలకమైనదన్నారు. వివిధ రంగాల్లో మహిళలను గుర్తించి అవార్డులు అందించడం సంతోషకరమైన పరిణామమన్నారు. పోలీసు డిపార్ట్‌మెంట్‌లో కూడా మహిళా ఆఫీసర్లు పెరుగుతున్నారని, చాలెంజింగ్ రంగం అయినప్పటికీ తమతో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి అజయ్‌మిశ్రా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అద్దంకి దయాకర్, ఎన్ఎస్ఐ గ్లోబల్ చైర్మన్ నవాబ్ షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

- తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ దేదీప్యరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వనం సంగీతాయాదవ్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి నర్సింగరావు, వనం శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో జరిగిన వేడుకల్లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వనం సంగీతాయాదవ్

ఆడపిల్లలు చదవాలి, ఎదగాలి

- **బోరబండ:** సమాజంలో ఆడపిల్ల చదవాలి, ఎదగాలని వైద్యాధికారి మచ్చ మమత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సైట్-2 ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బందితో కలిసి నిర్వహించారు. సైట్-3 తురేబాజ్‌ఖాన్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన మహిళ దినోత్సవంలో మాజీ డిప్యూటీ మేయర్ సతీమణి, కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తాన పలు రంగాల్లో సేవలందించిన మహిళలకు పూలబొకేలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో చీకోటి కవిత. వైజయంతి, రేణుక, రాధ, లక్ష్మి, పలువురు మహిళలు పాల్గొన్నారు.
- **ఖైరతాబాద్:** మహిళా దినోత్సవం సందర్భంగా పలు చోట్ల మహిళలకు సత్కారాలు అందాయి. టిపిసిసి ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలందరితో కలసి విజయారెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమణతో పాటు మహిళా సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, డీఐ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. మహిళా దినోత్సవం రోజున శివరాత్రి పర్వదినం రావడంతో మహిళలు చాలా చోట్ల వేడుకలను వాయిదా వేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- **పంజాగుట్ట:** తెల్లవారుజామునే మహానగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులను బీసీ కుల సంఘాల జేఏసీ కో చైర్మన్ వి.చిన్న శ్రీశైలం యాదవ్, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిద్దె కృష్ణ, రవితో కలిసి సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ, వాన, చలి కాలంలో సహితం వేకువ జామునే విధులకు హాజరవుతూ తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్న కార్మికుల సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని, డబల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని విన్నవించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ వేడుకలో కేక్ తినిపిస్తున్న హబీబా సుల్తానా



ఖైరతాబాద్ నియోజకవర్గ మహిళా నాయకులు, కార్యకర్తలతో కేక్ కట్ చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి



ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సత్కారం పొందిన మహిళా సిబ్బంది



సనత్ నగర్ పోలీస్ స్టేషన్లో ఇన్‌స్పెక్టర్ పురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళా పోలీసులను సత్కరిస్తున్న పోలీస్ సిబ్బంది - సనత్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి)

శివనామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని 'హరహర మహాదేవ శంభో శంకర' అనే శివనామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. ఉపవాస దీక్షలు చేస్తున్న భక్తులు శివలింగార్చన, దర్శనం కోసం బారులు తీరారు.

- సికింద్రాబాద్/ సనత్‌నగర్ జోన్ బృందం మార్చి 8, ఆంధ్రజ్యోతి


సనత్‌నగర్‌లోని శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి మర్రిశశిధర్ రెడ్డి, బీజేపీ నాయకులు


చిలకలగూడ బాలాంజనేయస్వామి ఆలయంలో జరిగిన శివరాత్రి వేడుకల్లో ఆలయచైర్మన్ నాగులూరి సాయిబాబా తదితరులు


బోయినపల్లి శివాలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు


మారేడ్‌పల్లి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయంలో నిర్వహించిన శివకళ్యాణం వేడుకల్లో భక్తులు


బల్కంపేట సాయిబాబా ఆలయంలో శివార్చన చేస్తున్న దంపతులు


వారాసిగూడ మేడిబావి ఆర్యసమాజంలో రుద్రయాగం, ఋషిబోదోత్సవంలో ఆర్యసమాజం అధ్యక్షుడు రవీందర్, పురోహిత్ బసంతరాణి, జయరాజ ఆర్య, భక్తులు


సైంటిఫిక్ కాలనీ మణికంఠ ఆలయంలో శివలింగార్చన కోసం బారులు తీరిన భక్తులు


నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ ఆవరణలో శివలింగానికి అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ హేమ


రెజిమెంటల్ బజార్‌లోని గౌరీ శివాలయంలో పూజలు చేస్తున్న ఆలయ ఇన్‌చార్జి శ్రావణ్ కుమార్, భక్తులు


భవానీనగర్ శివాలయంలో జరిగిన మహాశివరాత్రి వేడుకల్లో భక్తులు


అమీర్‌పేట హనుమాన్ ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు, భక్తులు


పుష్పాలతో అలంకరించిన భోలక్‌పూర్ మల్లికార్జున స్వామి ఆలయం


శివాలయంలో అభిషేకం చేస్తున్న సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్ దంపతులు

కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ కార్పొరేటర్

ఏఎస్‌రావునగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్‌లో బీఆర్ఎస్‌కు షాక్ తగలనుంది. మాజీ కార్పొరేటర్, సీనియర్ నాయకురాలు పావనీరెడ్డి ఆ పార్టీకి గుడ్‌బై చెప్పనున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ముఖ్య నాయకులను కలిసిన పావనీరెడ్డి ఈ నెల 14న కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మరికొంత మంది నాయకులు బీఆర్ఎస్‌ను వీడనున్నట్లు సమాచారం.

వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సైదులు



బౌద్ధనగర్, మార్చి8(ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.సైదులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన సైదులు చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వారాసిగూడకు వచ్చారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా, నేరాల నియంత్రణకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యకూడళ్లలో అవసరమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీలు, బస్తీల్లో, ముఖ్యప్రాంతాల్లో గస్తీలు నిర్వహిస్తామన్నారు. వారాసిగూడ పోలీస్‌స్టేషన్ మొదటి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన శంకర్ మల్టీజోన్‌కు బదిలీపై వెళ్లారు.

ధర్మధ్వజం ప్రతిష్ఠాపన మహోత్సవం

మారేడ్‌పల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పికెట్‌లోని ఒకే రాతిశిలతో 33 ఫీట్ల ఎత్తుతో నిర్మించిన శ్రీపంచభూత భూమేశ్వరస్వామి ఆలయ గోపురంపై శుక్రవారం 18 ఫీట్ల ఎత్తుగల ధర్మధ్వజం ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు ఉమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిమ్స్‌కు వచ్చిన మంత్రి దామోదర రాజనరసింహని కలిసి తమ సమస్యలు పరిష్కారం చేయాలని వినతి పత్రం అందించిన యూనియన్ అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నరసింహులు

- సనత్‌నగర్, మార్చి 8 ఆంధ్రజ్యోతి


బీదలబస్తీ గ్రౌండ్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ సదస్సును విజయవంతం చేయండి

బౌద్ధనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) అనుబంధ సంఘాల సదస్సును ఈనెల 10న సీతాఫల్‌మండి బీదలబస్తీలో నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతి మాదిగ తెలిపారు. ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు, బీదలబస్తీ అధ్యక్షుడు నందారం సీతారాం మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం బీదలబస్తీలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పదో తేదీ సాయంత్రం జరిగే సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకాధ్యక్షుడు మందకృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, కావునా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా అధికారప్రతినిధి దప్పు మల్లికార్జున్, మొగులయ్య, అంజనేయులు, గిరి, శ్రీకాంత్, శేఖర్, చిట్టి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

డీఎస్సీతోపాటు టెట్ పరీక్షలు నిర్వహించాలి

రాంనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీతో పాటు టెట్ పరీక్షలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ ఈనెల 11న చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ఇందిరాపార్కు వద్ద వేలాదిమంది టెట్ అభ్యర్థులతో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెట్ పరీక్షలు నిర్వహించిన తర్వాతనే డీఎస్సీ పరీక్షలు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డికి విన్నవించామన్నారు. పీఆర్సీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 25 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 11 వేలతో డీఎస్సీ ప్రకటించడం సరైన చర్య కాదన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని కృష్ణయ్య కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు సుధాకర్, రాజేందర్, రాజ్‌కుమార్, ఉదయ్, మునికృష్ణ, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొని ఎమ్మెల్సీ కవితకు కేక్ తినిపిస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత

- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి


మహిళా దినోత్సవంలో అదనపు కమిషనర్ జ్యోతి, మహిళలు

మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు

రెజిమెంటల్‌బజార్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని దేవాదాయ ధర్మదాయ శాఖ అదనపు కమిషనర్ జ్యోతి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కుమ్మరిగూడ రాజరాజేశ్వరి దేవాలయంలో దేవాలయ అభివృద్ధి కమిటీ, లలితా సత్సంగ్ సభ్యుల ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నాచారంగుట్ట దేవాలయ ఈవో అన్నపూర్ణ, రాజరాజేశ్వరి దేవాలయ ఈవో చంద్రశేఖర్, అభివృద్ధి కమిటీ సభ్యులు వీరలక్ష్మీ, ఎస్ఎస్ కుమారి, సక్కుబాయి, ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


మహిళా దినోత్సవ వేడుకలో కేక్ కట్ చేస్తున్న లక్ష్మీ నందకిషోర్

వీఆర్ ఆస్పత్రిలో మహిళా దినోత్సవం

బోయినపల్లి, మార్చి 08 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లి వీఆర్ ఆస్పత్రిలో శుక్రవారం ఎండీ లక్ష్మీ నందకిషోర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కేక్ కట్ చేయించి మహిళా దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఆస్పత్రి ఎండీ లక్ష్మీ నందకిషోర్ మాట్లాడుతూ.. సహనానికి, ఓర్పుకి మారుపేరు మహిళలని అన్నారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా ఇంటి బాధ్యతలను సమర్థవంతంగా నెరవేరుస్తూ వివిధ రంగాల్లో మహిళలు విశేషంగా రాణిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్థ, షెహనాజ్, ఆఫ్రీన్, మంజుల, శుభ, పావని, శిరీష, అంబిక, రామ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు రీజనల్ బెంచ్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

బర్కత్‌పుర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో సుప్రీం కోర్టు రీజనల్ బెంచ్ ఏర్పాటు బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు ఎస్.నాగేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజనల్ బెంచ్ ఏర్పాటు చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. రీజనల్ బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 100 ఎకరాల స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

ఏఐసీసీ లీగల్ సెల్ జాతీయ కో-ఆర్డినేటర్‌గా చల్లా దామోదర్‌రెడ్డి నియామకం



రాంనగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ లీగల్ సెల్ జాతీయ కో-ఆర్డినేటర్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, హైకోర్టు న్యాయవాది చల్లా దామోదర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ఏఐసీసీ జాతీయ కార్యదర్శి విపుల్ మహేశ్వరి ప్రకటించారు. శుక్రవారం డీడీ కాలనీలో తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పార్టీ జాతీయ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.


బోయినపల్లిలో జరిగిన కార్యక్రమంలో మహిళలు

మహిళ లేనిదే గమ్యం లేదు

బోయినపల్లి, మార్చి8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బోయినపల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్‌లో కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకురాలు యోగితా బల్వంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి మహిళలు వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా యోగితా బల్వంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళ లేనిదే గమ్యం, గమనం లేదన్నారు. మహిళ అంటే ఓ శక్తి అని, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులతో సమానంగా పోటీపడి నిజజీవితంలో ఎన్నో శిఖరాలను అధిరోహిస్తున్నారని వారు పేర్కొన్నారు. మహిళలు పురుషులతో పాటు సమాన హక్కులు పొందేందుకు మహిళాదినోత్సవం స్ఫూర్తి కావాలని అన్నారు. కార్యక్రమంలో పద్మ, బేగం, వాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మాదిగ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అడ్డగుట్ట శాస్త్రీనగర్ బస్తీలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకుంటున్న శాస్త్రినగర్ బస్తీ మహిళలు. కార్యక్రమంలో ఆ సంఘం హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి సుజాత, కమలమ్మ, వసంతమ్మ, సుజాత, అలివేలు, రేణుక, ఉమలు పాల్గొన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి

హరీష్‌రావు వ్యాఖ్యలపై ఉద్యోగుల ఖండన

చిక్కడపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఏసీ రూముల్లో కూర్చొని జీతాలు తీసుకుంటున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జీవో 317 ఉపాధ్యాయ ఉద్యోగం సంఘం పేర్కొంది. ఆయన మాటలు అభ్యంతకరమన్నారు. సంఘం అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రి, వర్కింగ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం సకల జనుల సమ్మెలో పాల్గొని పోరాటాలు చేసిన ఉద్యోగుల పట్ల హరీష్‌రావు అలా మాట్లాడటం సరికాదన్నారు.


బర్కత్‌పుర వద్ద డిజిటల్ వాహనాలను ప్రారంభిస్తున్న చింతల రామచంద్రారెడ్డి, డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు

బీజేపీ ప్రచార డిజిటల్ వాహనాలు ప్రారంభం

బర్కత్‌పుర, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో మరోసారి కమలం జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి రెండవసారి ఎంపీగా భారీ మెజారిటీతో గెలుపొందుతారని వారన్నారు. శుక్రవారం బర్కత్‌పురలో బీజేపీ నగర కార్యాలయం వద్ద ఎన్నికల ప్రచార డిజిటల్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమాదేవి, అమృత, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

13న బీసీ మహిళల సదస్సు

చిక్కడపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఆదర్శకిరణం ఆధ్వర్యంలో ఈనెల 13న త్యాగరాయగానసభలో బీసీ మహిళల సాధికార సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకులు వంగాల బాల్‌రాజ్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఆదర్శ దంపతులను సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో శాసనమండలి మాజీ చైర్మన్ కె. స్వామిగౌడ్, ఎంపీ ఆర్. కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు.


చేనేత వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వస్త్రాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న వినియోగదారులు

తార్నాక ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఘనంగా ప్రారంభమైన చేనేత హస్తకళా ప్రదర్శన

తార్నాక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఫ్యాషన్ వస్త్రాలను ఒకే వేదికపై అందించేందుకు కళా సిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో చేనేత హస్తకళా ప్రదర్శనను శుక్రవారం తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఘనంగా ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ప్రధానంగా చీరాల కుప్పడం, మంగళగిరి, టిష్యూ పట్టుచీరలు, బ్లాక్ ప్రింట్ సిల్క్ చీరలు, పోచంపల్లి, ఇక్కత్ డిజైన్ కుర్తీస్, బెంగాలీ కాటన్, ఉప్పాడ వెంకటగిరి, ధర్మవరం సిల్క్ సారీస్‌తో పాటు, హ్యాండీక్రాఫ్ట్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీస్ వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని ఎగ్జిబిషన్ నిర్వాహకులు వికాస్‌జైన్ శుక్రవారం తెలిపారు. ఈ చేనేత హస్తకళా ప్రదర్శన ఈ నెల 31వరకు తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో కొనసాగుతుందని, నగర ప్రజలు సద్వినియోగపరుచుకుని చేనేత హస్తకళలను మరింత ప్రోత్సహించాలని కోరారు.

బీఆర్ఎస్ పార్టీతో బీఎస్పీ పొత్తు అనైతికం

తార్నాక, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బహుజన సిద్ధాంతాలకు వ్యతిరేక పార్టీ అయిన బీఆర్ఎస్ పార్టీతో బీఎస్పీ పొత్తు పెట్టుకోవడం అనైతికమని దళిత క్రైస్తవ దండోర జాతీయ కన్వీనర్ ప్రొ.గాలి వినోద్ కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను తీవ్రంగా విమర్శించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్.. ఇప్పుడు బహుజనులను మోసం చేసి తన స్వార్థ ప్రయోజనాల కోసం పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీతో పెట్టుకోవడాన్ని ఖండించారు.

వైద్యం అందించడంలో మహిళా నర్సుల పాత్ర గొప్పది


సీనియర్ నర్సు జీవకిరీటంకు సన్మానం చేస్తున్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యులు

అడ్డగుట్ట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బస్తీలలో తిరిగి వైద్య ఆరోగ్య విషయంలో ఫీల్డ్‌వర్క్ చేసే మహిళా నర్సుల పాత్ర ఎంతో గొప్పదని అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం డాక్టర్ సాయిశంకర్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో 38 ఏళ్లుగా సీనియర్ నర్సుగా సేవలందించి ఎన్నో సేవా అవార్డులు దక్కించుకున్న సీనియర్ నర్సు జీవకీరిటంకు ఆస్పత్రి ఉద్యోగులు, ఆశావర్కర్లు ఘనంగా సన్మానం చేశారు.

మానవతా వాది అవార్డు అందుకున్న కల్పన


అవార్డు అందుకున్న డీబీఎఫ్ మహిళా ఉద్యమ నాయకురాలు కల్పన

అడ్డగుట్ట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన మానవతావాది అవార్డును అందుకున్నారు. అవార్డును శుక్రవారం సికింద్రాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో విశ్రాంతి ఐఏఎస్ అధికారి గోపాల్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నేత శంకర్ పాల్గొన్నారు.

నర్సింగ్ సేవలు పవిత్రమైనవి


సంగీతను సత్కరిస్తున్న డాక్టర్లు నిర్మల, పద్మ


చిలకలగూడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయమైన స్థితిలో ఉన్న రోగులకి వైద్యసేవలు అందిస్తున్న నర్సింగ్ సేవలు పవిత్రమైనవని డాక్టర్. నిర్మల పేర్కొన్నారు. లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన నర్సులు సుజాత, శ్రీలతలను శాలువతో సత్కరించి జ్ఞాపికలు అందజేసారు. ముఖ్య అతిథులుగా డాక్టర్లు నిర్మల, పద్మలు హాజరయ్యారు. ఈ కార్యక్రమమంలో ఆలిండియా రైల్వే నర్సెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేణుక, రాజ్‌కుమార్, అంజలి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విశ్వేశ్వరరావు

క్రైస్తవులు ఐకమత్యంతో పోరాడాలి

రెజిమెంటల్‌బజార్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల మీద మతోన్మాదుల దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టడానికి క్రైస్తవులు ఐకమత్యంతో పోరాడవలసిన అవశ్యకత ఉందని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ అమృతవాణిలో 'క్రైస్తవుల సమస్యలు-రాజ్యాంగ పరిష్కారం' అనే అంశం పై క్రైస్తవ ప్రజాస్వామ్య ఉద్యమం అనే సంస్థ సదస్సు నిర్వహించింది. తెలంగాణ జన సమితి పార్టీ ఉపాధ్యాక్షులు పీఎల్ విశ్వేశ్వర్ రావు, లాలాగూడ క్రైస్ట్ చర్చి ప్రెస్బిటర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ రాజేశ్వర్ సాలోమన్, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ డాక్టర్ సుధాకర్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మెల్కిసెడక్, సీపీఐ స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, సీపీఎం నాయకులు అబ్బాస్, కిష్టఫర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సికింద్రాబాద్ బోలక్‌పూర్‌లో శుక్రవారం నిర్వహించిన టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ఇండియా హెల్త్ ఆఫీస్ డైరెక్టర్ మిచెల్ లాంగ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అమృతా గోస్వామి, ఇండియా డెవలప్‌మెంట్ అసిస్టెంట్ స్పెషలిస్ట్ యోగేష్, డాక్టర్ స్నేహా శుక్లా, సయ్యద్ మహ్మదీ పాల్గొన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి


వారాసిగూడలో మేడారం సమ్మక్క సారక్క మాజీ ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్ సంజీవ్ ముదిరాజ్ నివాసంలో శుక్రవారం నిర్వహించిన సమ్మక్క, సారక్క ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మేడారం సారక్క అమ్మవారి ప్రధాన పూజారి కాకా సారయ్య దంపతులు.

- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి